క్లుప్తంగా

తాగునీటి నమూనాల సేకరణ



చాట్రాయి: మండలంలోని నరసింహారావు పాలెం గ్రామ పంచాయతీలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తాగునీటి నమూనాలను సేకరించారు. గ్రామంలో ఇటీవల ప్రజలు జ్వరాల బారిన పడ్డారు. దీంతో అధికారులు గ్రామంలోని పలుచోట్ల బోర్ల నుంచి సేకరించిన నీటి నమూనాలను పరీక్షలకు పంపించారు.

జాతీయ స్కాలర్‌షిప్‌నకు బాలికల ఎంపిక



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌నకు కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బి.పద్మలత సోమవారం తెలిపారు. 2023–24 ఏడాదికి ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసి స్కాలర్‌షిప్‌నకు ఎంపికై నగదు పురస్కారం పొందిన ఆనం తన్మయి, షేక్ షబానా, పీతా నవ్యశ్రీ, కన్నా బిందుప్రియకు మెరిట్ స్కాలర్ షిప్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థినులు పాఠశాల మధ్యలో చదువు ఆపేయకుండా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జాతీయ స్కాలర్‌షిప్ విధానం ప్రవేశ పెట్టినట్లు హెచ్‌ఎం తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసినవారికి సన్మానం



పెనుగొలను(గంపలగూడెం): వివిధ శాఖల్లో పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన నలుగురు ఉద్యోగులకు పెనుగొలనులో షిర్డీసాయి బాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగులు టీ నాగేశ్వరరావు, డీ వెంకటేశ్వరరావు, ఆర్.నీలకంఠం, ఎం. కైలాసంలకు కమిటీ సభ్యులు శాలువాలు కప్పి సన్మానించారు. ఉద్యోగ విరమణ చేసిన నలుగురి భావిజీవితం ఆయురారోగ్యంతో ఉండాలని కోరారు. విశ్రాంత ఎంఈవో వీ శేషిరెడ్డి, ప్రగతి స్కూల్ వీ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, పెనుగొలను గ్రంథాలయ నిర్వహణాధిరి జే శ్రీలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెండి వస్తువుల వితరణ

గంపలగూడెం: స్థానిక రామ భజన మందిరంలో పలువురు దాతలు రూ.24,600 విలువైన వెండి వస్తువులను సోమవారం వితరణగా కమిటీ సభ్యులకు అందజేశారు. భక్తులు కేతేపల్లి విష్ణుప్రసాద్, శ్రీదేవి దంపతులు రూ.6,500 విలువైన కుంది, తాటికొండ వేణుగోపాలకృష్ణ, విజయలక్ష్మి దంపతులు రూ.5,500 విలువైన హారతి కుంది, మరో ముగ్గురు భక్తులు పంచపాత్ర, ఉత్తరిని, సాంబ్రాణి పుల్లల గుత్తి, వెండి ప్లేటు అందజేశారు.

తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపైనే వ్యాపారాలు చేయడం, వాహనాలను నిలుపుదల చేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. స్టేట్ బ్యాంకు నుంచి బస్టాండ్ వరకు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. బ్యాంకు పనుల నిమిత్తం వచ్చే ఖాతాదారులు ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే నిలుపుదల చేస్తున్నారు. రోడ్లపైనే టిఫిన్ సెంటర్లు, బిర్యానీ వ్యాపారాలు కొనసాగించడం వలన కూడా ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోంది. వన్ వే నిబంధన కూడా అమలు కావడం లేదు. విజయవాడ నుంచి వచ్చే వాహనాలు, ఆర్టీసీ బస్సులు, బ్రాహ్మణ బజార్ నుంచి వెళ్లాల్సి ఉండగా ఆ నిబంధనను కూడా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏలూరు కాలువకు సాగు నీరు విడుదల చేయాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణా–ఏలూరు కాలువకు సకాలంలో సాగునీరు విడుదల చేయకపోవడంతో వరిసాగు చేస్తున్న రైతులు ఆందోళనచెందుతున్నారని కాకులపాడు మాజీ సర్పంచ్ పడకల శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకులపాడు ఛానల్ ఆయకట్టు భూములు ఎగువ ప్రాంతంలో ఉండటంతో సాగునీరు అందక వరి నారు మళ్లు ఎండిపోతున్నాయి. ఏలూరు కాలువ ద్వారా కాకులపాడు ఛానల్‌కు తక్షణమే సాగు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తల్లిపాలలో వ్యాధినిరోధకశక్తి మెండు

గంపలగూడెం: తల్లిపాలలో బిడ్డకు కావల్సిన వ్యాధినిరోధక శక్తి మెండుగా ఉంటుందని అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గంపలగూడెం 63వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బిడ్డపుట్టిన అరగంట లోపు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టాలన్నారు. శిశువుకు ఆరునెలల వరకు ఈపాలు మిక్కిలి శ్రేష్ఠమైనవని కార్యకర్తలు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు సరఫరాచేస్తున్న బాలామృతం తప్పక ఆహారంగా అందజేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బీ ప్రవంతి, ఏ నాగమణి, కస్తూరి, పీ హసీనాబేగం, ఏఎన్‌ఎం సరస్వతి, ఆశ వర్కర్లులు, తల్లులు, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ర్యాలీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని వార్డుల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 2కె ర్యాలీ సోమవారం జరిగింది. పలు వీధుల్లో తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ జి.రమాదేవి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని తెలిపారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వలన వ్యాధులు దరిచేరవన్నారు. తల్లులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. తల్లిపాల వలన బిడ్డలకు కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.



గంపలగూడెంలో తల్లిపాల ఆవశ్యకత వివరిస్తున్న కార్యకర్తలు

ఏ.కొండూరు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శివకుమారి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగించడం వల్ల ఆరోగ్యంగా ఉంటాడని ఆరు నెలల వరకు తల్లిపాలే తాగించాలన్నారు. గర్భిణులకు, తల్లులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వావిలాల, రాజుగూడెం గ్రామాల్లో జరిగిన అవగాహన సదస్సులలో తల్లిపాల ఆవశ్యకతను అంగన్‌వాడీ, వైద్యారోగ్య కార్యకర్తలు వివరించారు. రాజుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



కొండపల్లి బొమ్మల కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, తల్లులు



రామచంద్రాపురం తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న కార్యకర్తలు



తిరువూరులో తల్లిపాల ఆవశ్యకత వివరిస్తున్న రేష్మాబేగం తదితరులు

తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు

తిరువూరు: నవజాత శిశువుకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఎంతో మేలు చేస్తాయని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి రేష్మా అన్నారు. స్థానిక వడ్డెర బజారు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిశువుకు న్యూమోనియా, అతిసార తదితర వ్యాధులు రాకుండా తల్లిపాలు కాపాడతాయని, బిడ్డకు పాలిచ్చే మహిళల్లో రొమ్ము, అండాశయ, గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశం లేదన్నారు. సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

మైలవరం: విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉండి, బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ లకిరెడ్డి ప్రసాదరెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్‌లోకొత్తగా చేరిన విద్యార్థులకు మొదటి సంవత్సరం తరగతులను సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మైలవరం, సుదూరు ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు విద్యను విస్తరించాలనే ఉద్దేశంతో కళాశాలను స్థాపించామన్నారు. కో ఫౌండర్, హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ విద్యతో పాటు వినయాన్ని అలవర్చుకోవాలన్నారు. కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అనంతరం లకిరెడ్డి ప్రసాదరెడ్డి తల్లి లకిరెడ్డి సరస్వతి పేరున కళాశాలలో ప్రతి విభాగంలో మొదటి స్థానంలో ఉత్తీర్ణులైన 62 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల విలువైన చెక్కులను అందజేశారు. లకిరెడ్డి ప్రసాదరెడ్డి సతీమణి బేబీరాణి, ఎల్‌బీఆర్ సిటీ ట్రస్టీ యండూరి సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్‌రెడ్డి, డీన్స్, వివిధ విభాగాల విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

ఆర్డీఓ భవానీశంకరి

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీ కోసం)లో వచ్చే అర్జీలను గడువులోగా అధికారులు పరిష్కరించాలని ఆర్డీఓ వై.భవానీశంకరి పేర్కొన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఇచ్చే అర్జీలను పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపిస్తున్నామన్నారు. వాటిని జాప్యం చేయకుండా సకాలంలో అధికారులు పరిష్కరించాలన్నారు. ఏమాత్రం అలసత్వం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని, దీంతో అర్జీ పరిష్కారమైందా, లేదా అనే విషయాన్ని కలెక్టర్ నుంచి సీఎం వరకు ఎప్పుడైనా చూడొచ్చన్నారు. పరిష్కారానికి వీలవ్వకపోతే సంబంధిత కారణాన్ని చూపించాలన్నారు. మీకోసంలో అర్జీ ఇస్తే సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకాన్ని మరింత పెంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

16 అర్జీల స్వీకరణ

మీకోసంలో సోమవారం 16 అర్జీలు వచ్చాయి. వీటిలో పట్టణంలోని కొండయ్య సత్రం శిథిలావస్థకు చేరిందని, దానిని కూల్చివేసి నూతన సత్రాన్ని నిర్మించాలని బీజేపీ నాయకులు వైఎస్ దొరై అర్జీని అందజేశారు. విద్యార్థుల బాల్యాన్ని చిదిమేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలంటూ ఐసా జిల్లా కార్యదర్శి గరికే అఖిల్ అర్జీని అందజేశారు. తమ వ్యవసాయ భూములను సర్వే చేయాలని, పింఛన్ మంజూరు చేయాలని, రోడ్లకు మరమ్మతులు చేయాలని తదితర సమస్యలపై అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ నాగేశ్వరి, ఉద్యాన అధికారి ఆర్.హేమ, డీఎల్‌డీఓ వెంకటరత్నం, డీఎల్‌పీఓ సుందరి తదితరులు పాల్గొన్నారు.



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీలను తీసుకుంటున్న ఆర్డీఓ భవానీశంకరి

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

తిరువూరు: పట్టణంలో విలువైన ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ముదిగొండ దుర్గాప్రసాద్ తిరువూరు ఆర్డీవో మాధవికి వినతిపత్రం సమర్పించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజావినతుల స్వీకార కార్యక్రమంలో దుర్గాప్రసాద్ పాత బస్టాండుకు గతంలో కేటాయించిన స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా రక్షించాలని కోరారు. అసంపూర్తిగా నిలిచిపోయిన డ్రెయినేజీల నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేయాలని కోరారు.



తిరువూరు ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ దుర్గారావు

అక్రమ కట్టడాలు కూల్చివేయాలి

తిరువూరు ప్రధాన రహదారిలోని దేవదాయశాఖ స్థలంలో అక్రమంగా నిర్మించిన దుకాణాల స్థానంలో ప్రభుత్వ వాణిజ్య సముదాయం నిర్మించాలని నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్ దుర్గారావు ఆర్డీవోను కోరారు. కన్యకాపరమేశ్వరి సత్రానికి చెందిన 4 ఎకరాల 28 సెంట్ల వ్యవసాయ భూమిని కూడా స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): సీజనల్ వ్యాధులపై అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ స్టేట్ కన్సల్‌టెంట్ ఆఫ్ ఎంటమాలజీ డాక్టర్ పి.కొండారెడ్డి తెలిపారు. గుంటుపల్లి గ్రామ పంచాయతీలో ప్రొక్యూర్‌మెంట్ కన్సల్‌టెంట్ మనోజ్‌తో కలసి సీజనల్ వ్యాధులు, దోమల నివారణ చర్యలపై సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నివాస ప్రదేశాల్లో దోమలు నిల్వ ఉండే పాతటైర్లు, వాడేసిన కొబ్బరి బొండాలు, ఆరుబైట నిరుపయోగంగా పడిఉండే వంటసామగ్రి తదితర లార్వా ఉత్పత్తి చేసే ప్రదేశాలను గుర్తించారు. నివాస ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు ఉంచరాదని వివరించారు. వ్యాధుల నివారణపై చేపట్టాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. రాత్రివేళ దోమతెరలు వాడాలని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్ పర్వీన్, సీహెచ్‌వో కేవీఎస్.నారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ రోశయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



గుంటుపల్లిలో మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ రాష్ట్ర కన్సల్‌టెంట్ సభ్యుడు కొండారెడ్డి

పారిశుద్ధ్యం మెరుగు పర్చాలని వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలోని 5వ వార్డుతో పాటు అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం పనులు మెరుగుపర్చాలని 5వ వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ మున్సిపల్ కమిషనర్ వై.శంకర్‌నాయక్‌ను కోరారు. ఆయన కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు వీధులు, డ్రైనేజీలు అపరిశుభ్రంగా మారాయన్నారు. డయేరియా, చికెన్ గున్యా వంటి విషజ్వరాలు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.



కొండపల్లి కమిషనర్ శంకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ దయాసాగర్

విద్యతోనే సమాజంలో గుర్తింపు

మైలవరం: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మైలవరం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం ఎమ్‌బీఎమ్ జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు నగదు బహుమతులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్‌తో కలిసి సోమవారం అందజేశారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని, తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. పదో తరగతి పాస్ అయిన ముగ్గురు బాలికలు నూజివీడు, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. వారితో పాటు ఇంటర్‌లో కెమిస్ట్రీ సబ్జెక్టులో నూటికి నూరు శాతం మార్కులు సాధించిన మరో ముగ్గురికి జూనియర్ కళాశాల అధ్యాపకులు శరత్ బాబు ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున, బోటనీ సబ్జెక్టులో నూరు శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల అధ్యాపకురాలు సుశీల ఒక్కొక్కరికి రూ.5 వేల వంతున నగదు బహుమతులు అందజేశారు. మరో అధ్యాపకుడు శ్రీరామ్‌ప్రసాద్ ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు రూ.10 వేలను ఫిజిక్స్, కెమిస్ట్రీ స్టడీ మెటీరియల్ నిమిత్తం అందజేశారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థినికి రూ.5 వేలను టీచర్ సుమ అందజేశారు.

జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో ఎమ్మెల్యే వసంత, నెట్టెం రఘురామ్ తదితరులు

సమాజ హితం కోసం పనిచేయాలి

ఏపీఎంపీఏ జిల్లా సర్వసభ్య సమావేశం

మైలవరం: జర్నలిస్టులు సమాజ హితం కోసం పనిచేయాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) జిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమం కోసం తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. పాత్రికేయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు సమాజ హితం కోసం పనిచేయాలన్నారు. మైలవరంలో ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు. సమావేశంలో మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు, సూఫీ మత గురువు అల్తాఫ్ రాజా బాబా, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

జి.కొండూరు: మండల తహసీల్దార్‌గా చాట్ల వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన వీవీఎల్ నర్సింహారావు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. నూతన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

- విస్సన్నపేట: స్థానిక తహసీల్దార్‌గా లక్ష్మీకల్యాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పెనుగంచిప్రోలు తహసీల్దార్‌గా పని చేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు.
- ఇబ్రహీంపట్నం: మండల తహసీల్దార్‌గా వై.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అమరావతి సెక్రటేరియట్‌లో సెక్షన్ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వచ్చి ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎల్‌ఎన్‌వీఎస్ రాజు ఏలూరు జిల్లా పోలవరం మండలానికి బదిలీపై వెళ్లారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. డెప్యూటీ తహసీల్దార్ మహేష్, ఆర్ఐ గోపీ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.
- ముసునూరు: మండల తహసీల్దార్‌గా కె.రాజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండవల్లి తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా డీటీ ఎమిలీ కుమారి, ఆర్ఐ దీపిక, వీఆర్వోలు మస్తాన్‌రావు, నవీన్, హరిబాబు, రెవెన్యూ సంఘ సభ్యులు, కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.
- మైలవరం: మండలం తహశీల్దారుగా జీ బాలకృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గంపలగూడెం తహసీల్దారుగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు మైలవరం తహసీల్దారుగా పనిచేసిన టీఎస్ రాజేశ్వరరావు బదిలీపై అంబేడ్కర్ కోనసీమకు వెళ్లారు.
- రెడ్డిగూడెం: మండల తహసీల్దానేగా జే సుశీలదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల బదిలీలలో భాగంగా ఇక్కడకు వచ్చిన ఝాన్సిలక్ష్మీకుమారి బదిలీ కావడంతో ఉన్నతాధికారులు సుశీలాదేవిని ఇక్కడ నియమించారు. ఆమె సోమవారం బాధ్యతలు చేపట్టారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

ఏ.కొండూరు: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో వరద బాధితుల సహాయార్థం సీపీఎం నాయకులు సోమవారం చీమలపాడు గ్రామంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జట్టి వెంకటేశ్వరరావు, పి.ఆనందరావు, ఏ అమ్మిరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సేకరించిన విరాళాలను పార్టీ ద్వారా కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి అందించడం జరుగుతుందన్నారు. పంబి వెంకటేశ్వరరావు, సోమ మోహనరావు, లక్ష్మయ్య, సర్వేసోములు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: కేరళలో వయనాడ్ వరద బాధితుల సహాయార్థం తిరువూరులో సీపీఎం నాయకులు సోమవారం విరాళాలు సేకరించారు. ఫ్యాక్టరీ సెంటర్ నుంచి జోలెపట్టి దుకాణాల వద్ద విరాళాలు స్వీకరించారు. కట్టుబట్టలతో, తిండీ నీరు లేక అల్లాడుతున్న వయనాడ్ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్ కోరారు. విరాళాల సేకరణలో పార్టీ నాయకులు ఎస్‌వీ భద్రం, పంతంగి శ్రీనివాసరావు, బీ వెంకటేశ్వరరావు, కాగిత రాము, ఆలీబాబా పాల్గొన్నారు.



తిరువూరులో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

ఇబ్రహీంపట్నం: బైక్, కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు గాయపడ్డారు. మండలంలోని కేతనకొండ వద్ద సోమవారం ఈప్రమాదం జరిగింది. సీఐ ఎం.సత్యన్నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పరిటాల అమృతసాయి కళాశాలలో చదువుతున్న అద్దంకి శ్రీనివాసరావు తనతోటి విద్యార్థి వేణును బైకుపై ఎక్కించుకుని ఇబ్రహీంపట్నం వైపు వస్తున్నాడు. కేతనకొండ వద్ద బైకు ముందుగా వెళుతున్న కారు సడెన్ బ్రేక్ వేయడంతో కారుకు ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. గాయపడిన వారిని జూపూడిలోని నిమ్రా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా విశ్వకర్మ భగవాన్ యజ్ఞమహోత్సవం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):కొండపల్లిలో శ్రీమద్విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకుడు కత్తురోజు రామకృష్ణ వారిని ఘనంగా సత్కరించారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్తి శ్రీనివాసచక్రవర్తి, కత్తురోజు రామకృష్ణ ఆధ్వర్యంలో 60 మంది భక్తులు విశ్వకర్మ భగవాన్ మాలాధారణ స్వీకరించారు. ఈ సందర్భంగా శాంతియజ్ఞం నిర్వహించారు. దేశంలో మొదటి సారిగా జరిగిన మాలధారణ సెప్టెంబర్ 17న విరమిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, పలువురు కూటమి నాయకులు పూజలు నిర్వహించారు. అతిథులకు విశ్వకర్మభగవాన్ చిత్రపటాలు అందజేశారు. కూటమి నాయకులు, వివిధ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



దీక్షల స్వీకారంలో అతిథులకు చిత్రపటాలు అందజేస్తున్న కత్తురోజు రామకృష్ణ, తదితరులు

భారం కాదు.. భరోసా



హెల్మెట్ ధరించడాన్ని భారంగా పరిగణిస్తుంటారు ద్విచక్రవాహన చోదకులు. ఇప్పటికీ ఎక్కడికక్కడ పోలీసులు అవగాహన కల్పిస్తూ, జరిమానాలు విధిస్తున్నా ఇంకా కొందరు హెల్మెట్ లేకుండానే ద్విచక్రవాహనాలు నడుపుతున్నారు. నూజివీడు పట్టణంలో ఒక వ్యక్తి తనతోపాటు తన భార్యకు, ఐదేళ్ల కుమారుడికి కూడా హెల్మెట్‌ను పెట్టి ప్రయాణిస్తూ..హెల్మెట్ భారం కాదు.. భరోసా అని నిరూపించాడు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. ఇలా అందరూ హెల్మెట్ ధరించి ప్రయాణిస్తే ప్రమాదాలు సంభవించినప్పుడు మరణాల శాతం చాలా వరకు తగ్గుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

–నూజివీడు

వివాహిత అనుమానాస్పద మృతి



సుబ్బలక్ష్మి మృతదేహం

జి.కొండూరు: వివాహిత ఉరేసుకున్న స్థితిలో అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండల పరిధి గుర్రాజుపాలెం గ్రామంలో సోమవారం రాత్రి 7 గంటల సమయంలో జరిగింది. వివరాలలోకి వెళ్తే..రెడ్డిగూడెం మండల పరిధి రెడ్డికుంట గ్రామానికి చెందిన సుబ్బలక్ష్మి (26)కి జి.కొండూరు మండల పరిధి గుర్రాజుపాలెం గ్రామానికి చెందిన పుచ్చకాయల తిరుపతిరావుతో ఐదు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే ఉమ్మడి కుటుంబంగా ఉన్న వీరు, వేరుకాపురం పెట్టే విషయమై కుటుంబంలో వివాదం తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో సుబ్బలక్ష్మి సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఇంట్లోని ఉయ్యాల కడ్డీకి ఉరేసుకున్న స్థితిలో మృతి చెందింది. సమాచారం అందుకున్న జి.కొండూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.